క్లుప్తంగా

మిర్చి తోటల పరిశీలన

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం, చిన్న గోపతి గ్రామాల్లోని శనివారం మిర్చి తోటలు, కల్లాలను మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చిలో అక్కడక్కడా తాలు కాయలు కనిపించడంతో వ్యాపారులు ధర తగ్గిస్తున్నారన్నారు. కావున రైతులు మిర్చిలో తాలు లేకుండా మార్కెట్‌కు తరలిస్తే.. మంచి ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది నవంబర్ నెలలో వచ్చిన తుఫాన్ తర్వాత మిర్చిలో కాయకుళ్లు వైరస్‌ల వల్ల మచ్చ, తాలు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

మధిరరూరల్: మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో ఈ నెల 21న జరగనున్న టీఎస్ యూటీఎఫ్ మధిర మండల మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి కోరారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనియన్ మండల మహాసభలు టీవీఎం హైస్కూల్లో ఆదివారం ఉదయం ప్రారంభమవుతాయన్నారు. సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ప్రాంతీయ కన్వీనర్ రావిరాల లక్ష్మణరావు, మండల ఉపాధ్యక్షుడు ఇర్రి వీరయ్య, నాయకులు లాల్ అహ్మద్, జీబీఎంఎస్ రాణి పాల్గొన్నారు.

నియామకం

సత్తుపల్లి: సత్తుపల్లి మండల నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పిల్లి రవికిరణ్, గౌరవ అధ్యక్షుడిగా వాళ్ల విజయ్‌కుమార్ నియమితులయ్యారు. స్థానిక ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో శనివారం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.సుందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సుందర్‌రావు,ఉప కార్యదర్శిగా దానియేలు, కోశాధికారిగా చార్లెస్‌బెన్నీ, ప్రచార కార్యదర్శిగా హెచ్ ఏసుపాదం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షులు అవాల కరుణాకర్, పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు పింగళి సామేలు, కె.నాగార్జున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్: మండలంలోని బోనకల్–ఖమ్మం ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ముష్టికుంట్లకు చెందిన సంగాపు శ్రీను ద్విచక్ర వాహనంపై బోనకల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో బోనకల్ నుండి ఖమ్మం వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే, కారు నడుపుతున్న వ్యక్తి ఆపకుండా పరారు కాగా, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో చోరీ

వైరారూరల్: మండలంలోని విప్పలమడక గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలో ఉన్న రెండు హుండీలను పగులగొట్టి వాటిలో కానుకలు, నగదును చోరీ చేసినట్లు ఆలయ ఈఓ ఎస్‌వీవీ ప్రసాద్ తెలిపారు. చోరీకి గురైన నగదు విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని ప్రాథమిక అంచనా వేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: పట్టణంలోని బంజారా కాలనీ శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రేగళ్ల బ్రహ్మారెడ్డి, సునీత దంపతుల ఆర్థిక సాయంతో శనివారం నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్ పర్సన్ గుర్రం ప్రమీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి శనివారం దాతల సహకారంతో పేదల కోసం ఆలయం వద్ద అన్నదానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కటకం నరసింహారావు, గంగవరపు వీరారెడ్డి, చేడే రామకోటేశ్వరరావు, మేడా అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ప్రమీలకు నగదు అందిస్తున్న ఎంఈఓ జయరాజు, టీఎస్‌టీటీఎఫ్ నాయకులు

కారేపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కారేపల్లి మండల విద్యాశాఖ సీఆర్పీ ప్రమీలను టీఎస్‌టీటీఎఫ్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు రూ.14వేలు విరాళంగా అందించిన నగదును మండల విద్యాశాఖ అధికారి జయరాజు అందించారు. కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు బానోత్ శ్యామ్‌లాల్, జిల్లా అధ్యక్షుడు బానోత్ మంగ్యానాయక్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కేలోత్ రాములునాయక్, మండల అధ్యక్షుడు అజ్మీర వీరూనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

- ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు
- పరిశీలించిన అధికారులు



బోనకల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించారు. ఆన్‌లైన్ లేదా ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గతేదాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల నమోదు ప్రక్రియను విడతల వారీగా చేపట్టగా.. ప్రస్తుతం మరో అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు జాబితాలో పేర్లు లేనివారు కూడా ఓటర్లుగా నమోదు కావచ్చు. ఇందుకోసం శని, ఆదివారాలలో నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

సత్తుపల్లిటౌన్/ వేంసూరు/ చింతకాని/ బోనకల్/ ఎర్రుపాలెం/ ఏన్కూర్: మండలాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి తనిఖీ చేశాక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈనేపథ్యాన సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో కల్లూరు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి తనిఖీ చేయగా తహసీల్దార్ ఎంపీ రాజు, ఆర్‌ఐలు చిరంజీవి, గోపి, హెచ్‌ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు. అదేవిధంగా చింతకానిలోని నాగులవంచ, పందిళ్లపల్లి గ్రామాలు, బోనకల్ మండలంలోని బోనకల్, ముష్టికుంట్ల, రావినూతల, కలకోట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ గణేశ్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్లు రమేష్, పున్నం చందర్, మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్, ఆర్‌ఐ లక్ష్మణ్, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎర్రుపాలెం మండలంలోని తెల్లపాలెం, ఎర్రుపాలెం , పెద్దగోపవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఉషాశారద తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్‌ఐ రవికుమార్, గ్రామ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, తదితరులున్నారు. అంతేకాక ఏన్కూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటు నమోదు కార్యక్రమాన్ని ఎంపీడీఓ వేణుమాధవ్ పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ సూరయ్య, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యుల దరఖాస్తులు మాత్రమే తీసుకోవాలని, ఎక్కువ మొత్తంలో ఎవరు తీసుకొచ్చినా స్వీకరించవద్దని ఆదేశించారు.

నంబర్ ప్లేట్ లేకుంటే జైలుకే..



మాట్లాడుతున్న సీఐ హనూక్



మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

కల్లూరు: వాహనాల నంబర్ ప్లేట్ పూర్తిగా కనిపించకపోయినా, లేకపోయినా కఠిన చర్యలు తప్పవని సత్తుపల్లి రూరల్ సీఐ హనూక్ పేర్కొన్నారు. కల్లూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ వాహనానికైనా నెంబర్ ప్లేట్ క్లియర్‌గా ఉండాలని, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాల ఆచూకి దొరకడం లేదన్నారు. దొంగబండ్లు మార్చుకోవడానికి, చైన్ స్నాకింగ్ లాంటి నేరాలను అదుపులో ఉంచడానికి పోలీస్‌శాఖ ఈ చర్యలు తీసుకుంటుందన్నారు. ఇక నుంచి రాత్రి 10 గంటలు దాటిన తర్వాత షాపులు, దుఖానాలు, టీస్టాల్స్ బంద్ చేయాలని యజమానులను ఆదేశించారు. లేనట్‌లైతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుల సహాయం కోసం 100, సైబర్ క్రైమ్ ఐతే 1930, మహిళలు, బాలికలకు సంబంధించి 1098 నంబర్లను ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. సమావేశంలో సీఐతో పాటు ఎస్సై పి.రఘు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సత్తుపల్లిరూరల్: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులకు వివరించాలని సత్తుపల్లి ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా కాకర్లపల్లి హైస్కూల్‌లో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిర్లక్ష్యం వాహనాలు నడపటం, సరైన జాగ్రత్తలు పాటించకపోవటం వల్ల నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెంట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నక్కా రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు రాంబాబు, సురేష్, మురళీ మోహన్, శేషాచార్యులు, సుదర్శనమ్మ, గోపి, రమణాదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం..

ఎర్రుపాలెం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఏఎస్సై వెంకటాచార్యులు, పాఠశాల సూపరిండెంట్ కె.సరిత తెలిపారు. శనివారం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు అప్రమత్తతగా ఉండాలన్నారు. అవసరమైతే.. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, ఎమర్జెన్సీ 100 నంబర్లకు డయల్ చేయాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో బ్లూకోట్ కానిస్టేబుల్ ప్రకాష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



సత్తుపల్లిలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

మధిర/సత్తుపల్లిటౌన్: మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో, సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్, పాతసెంటర్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా మధిర మండల విద్యాశాఖాధికారి వై.ప్రభాకర్ విలేకరులకు మాట్లాడుతూ.. మధిరలోని టీవీఎం పాఠశాలలో 169 మంది విద్యార్థులకు గాను 130 మంది విద్యార్థులు హాజరు కాగా.. 39 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్.హైమావతి, పరిశీలకులుగా సాహ వ్యవహరించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా సత్తుపల్లి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 463 మంది విద్యార్థులకు గాను 386 మంది విద్యార్థులు హాజరయ్యారు. 77 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను ఎంఈఓ రాములు హెచ్‌ఎంలు శైలకుమారి, యాకోబు, నవోదయ అధికారులు పర్యవేక్షించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మల్లు నందిని విక్రమార్క, తదితరులు

మధిర: మధిర మున్సిపల్ కౌన్సిలర్ కోనా ధనికుమార్, సుచరిత దంపతుల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, నాయకులు షేక్ జహంగీర్, పారుపల్లి విజయ్, సిద్దంశెట్టి సందీప్, వెంకటరమణ, రాజేందర్, బాహాటం వనిజ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ముదిగొండ: మండలంలోని బాణాపురం, పెద్దమండవ గ్రామాల్లోని కాంగ్రెస్ నేతల కుటుంబాలను శనివారం మల్లు నందిని పరామర్శించారు. బాణాపురానికి చెందిన ఆవుల పెద్దరామిరెడ్డి శుక్రవారం మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. పెద్దమండవలో ఉన్నం కోటేశ్వరరావు సతీమణి జరోజనమ్మ దశదిన కర్మకు హాజరై, ఆమె చిత్ర పటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. ఆమె వెంట డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, బుల్లెట్‌బాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వనం నర్సింగరావు, పాల్లూరి భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



చింతకాని: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను మండలంలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను భట్టి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇనుకుళ్ల నాగసూరారెడ్డి, లింగం రాంబాబు, మేకల తిరుపతి, ఇనుకుళ్ల బ్రహ్మారెడ్డి, సీతారామిరెడ్డి, దేవరపల్లి సుధాకర్ రెడ్డి, కిలారు వెంకటేశ్వరరెడ్డి, కొండపరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేయాలని ధర్నా

తల్లాడ: సీసీఐ కేంద్రంలో పత్తిని రెగ్యులర్‌గా కొనుగోలు చేయాలని కోరుతూ.. రైతులు శనివారం సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక చీడపీడలను తట్టుకుని పండించిన పత్తిని రైతులు సీసీఐ కేంద్రంలో విక్రయించేందుకు వస్తే.. పలు నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. సీజన్‌లో కనీసం 20 రోజులు కూడా పత్తిని కొనుగోలు చేయలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లమోతు మోహన్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, పులి వెంకటనర్సయ్య, దగ్గుల పుల్లారెడ్డి, దగ్గుల సత్యనారాయణరెడ్డి, ఇంటి వెంకటేశ్వర్లు, కొప్పుల నరసింహారావు, కటికి నరసింహారావు, దుగ్గిదేవర శ్రీనివాసరావు, అద్దంకి గురువులు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్స కేంద్రాలు తనిఖీ



ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి రాములు

ఏన్కూరు: మండల కేంద్రలోని ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్‌లను ప్రభుత్వ వైద్యాధికారి రాములు శనివారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, సర్టిఫికెట్లు, ఆర్‌ఎంపీ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటి రెండు చోట్ల తప్ప వేరే వారి దగ్గర ఎలాంటి ఆధారాలు లేకుండానే వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు.

కబడ్డీలో విద్యార్థిని ప్రతిభ



కాంస్య పతకం సాధించిన మహేశ్వరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆలకుంట మహేశ్వరి జనగామలో ఈ నెల 16 నుంచి 18వరకు జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్యపతకం సాధించినట్లు పాఠశాల పీఈటీ బయ్యని కృష్ణయ్య తెలిపారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మధిర: పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శనివారం శ్రీ రామ తీర్థ ట్రస్ట్ నిర్వాహకులు దుర్గాప్రసాద్, రాజేశ్వర శర్మ, శివరాజు శ్రీనివాస్, వినయ్ ఆధ్వర్యంలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మధిర, ఎర్రుపాలెం మండలాలకు చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: సత్తుపల్లిలో శనివారం శ్రీరాముని జీవిత చరిత్ర మానవాళికి ఆదర్శం అనే అంశంపై సత్తుపల్లి, వేంసూరు మండలాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జె.మిత్ర, పి.కారుణ్య, ఎస్‌కె పర్వీన్‌లు గెలుపొందారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గోర్ల వెంకటరెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, చింతల సుబ్బారావు, కోరుకొండ వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, జె.శ్రీనివాసరావు, సతీష్, పాలకొల్లు శ్రీను, సీహెచ్ దాశరథి పాల్గొన్నారు.

అయోధ్యకు రైలు సౌకర్యం

ఏన్కూరు: రాష్ట్రంలోని రామభక్తులు అయోధ్య రాముని ప్రాణ పతిష్ఠ అనంతరం రాముడిని దర్శించుకునేందుకు రైలు సౌకర్యం కల్పించిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 3న కాజీపేట నుంచి అయోధ్యకు ఏర్పాటు చేసిన రైలులో రూ.1,900లతో అల్పాహారంతో పాటుగా భోజనవసతి కల్పించనున్నట్లు తెలిపారు. అయోధ్యలో చలి ఎక్కువగా ఉన్నందును 50 సంవత్సరాల లోపు వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. చలికాలం అనంతరం వృద్ధులకు అవకాశం ఉంటుందన్నారు. మిగతా వివరాల కోసం 9441836334 నంబర్‌కు ఫోన్ చేయవలసిందిగా కోరారు.

22న సెలవు దినంగా ప్రకటించాలి..

తల్లాడ: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా తెలంగాణా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయోధ్యలో జరిగే అద్భుతమైన విగ్రహ ప్రాణప్రతిష్ఠను టీవీ మాధ్యమాల్లో చూసేందుకు ఇప్పటికే అనేక రాష్ట్రాలు సెలవు ప్రకటించాయని, తెలంగాణాలో కూడా సెలవు ప్రకటించాలని కోరారు.

చర్యలు తీసుకోవాలి

వైరా: మండలంలోని సోమవరం వద్ద గ్రీన్‌ఫీల్డు హైవే నేషనల్ హైవే ఆథారటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బ్రిడ్జి.. పనుల్లో నాణ్యత పాటించకపోవడం వల్లే కూలిందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు సీవై పుల్లయ్య, వైరా డివిజన్ కార్యదర్శి కె.అర్జునరావు, మండల కార్యదర్శి ఎలదండి బాబు తెలిపారు. తక్షణమే విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న చలమాల విఠల్‌రావు

పెనుబల్లి: మిరపసాగు రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలో నిర్వహించిన ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి వెంటనే ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తాండ్ర రాజేశ్వరరావు, తిరుపతిరావు, నరసింహారావు, సత్యం, బాబు, నాగమణి, టి.చిరంజీవి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

వేంసూరు: మండలంలోని మర్లపాడులో శనివారం జీవీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ గంధ్ర సోమిరెడ్డి, జయ దంపతులు మనవలు విరాజ్, రియాన్షిల జన్మదిన సందర్భంగా గ్రామానికి చెందిన 70 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ శ్రీనివాస్, గంధ్ర మాధవరెడ్డి, రామచంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాలకోసం 'లోకోస్'



సమావేశం నిర్వహిస్తున్న ఐకేపీ అధికారులు

కల్లూరు: స్వయం సహాయ సంఘాలను మరింత పటిష్టం చేయడానికి సెర్ప్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఐకేపీ డీపీఎం డి.శ్రీనివాస్, ఏపీఎం వెంకట్రామారావు తెలిపారు. శనివారం కల్లూరు ఐకేపీ కార్యాలయంలో ఉషోదయ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలను జాతీయ జీవనోపాదుల కల్పన పథకానికి అనుసంధానం చేయడానికి లోకోస్ యాప్‌లో బ్యాంక్ అకౌంట్, సభ్యుల ఆధార్ కార్డ్, సంఘం వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి సంఘంలో పొదుపులో అప్పులు, శ్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంజీ ప్రశాంత్‌రెడ్డి, సీసీలు పి.వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్యామలాదేవి, టి.రాజ్యలక్ష్మి, వెంకట్రావమ్మ, ఎస్తేరు ఆనందకుమారి, అకౌంటెంట్ అపర్ణలక్ష్మి, గ్రామ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: ఈ నెల 29న నిర్వహించే ఎస్ఎంసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. శనివారం వైరాలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశ్వరి, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు నాగబత్తిని స్వప్న, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మమ్మల్ని రక్షించండి

సత్తుపల్లిరూరల్: సింగరేణి కాలుష్యం కోరల్లో చిక్కుకున్న మమ్మల్ని రక్షించాలని కోరుతూ.. కిష్టారంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే రాగమయికి వినతిపత్రం అందించారు. అంబేడ్కర్ కాలనీ సమీపంలో నిర్మించిన సైలో బంకర్(ట్రెన్ లోడింగ్ పాయింట్) నుంచి వెలువడే బొగ్గు దుమ్మారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారని, త్వరితగతిన సింగరేణి యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరడంతో.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మారోజు శ్రీను, నాగేశ్వరరావు, సందీప్, ప్రభుదాస్, నాగరత్నం, రజిని, నాగమణి, సుగుణ, రమేష్, కోటిరెడ్డి, సుంద్‌రావు, రాకేష్ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓకు వినతి



ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో శనివారం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. నియోజకవర్గానికి సంబంధించిన సుమారు 60 కోట్ల అభివృద్ధి నిధులు, పనులు గురించి చర్చించారు. నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. .

ప్రభుత్వం ఆరు గ్యారంటీలపై దృష్టి పెట్టాలి

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆరు గ్యారంటీలపై దృష్టి పెట్టి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వేములకొండ రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గుబ్బగుర్తి గ్రామంలో జరిగిన పార్టీ గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మండలంలో ఉన్న పలు సమస్యలను నూతన ఎమ్మెల్యే పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాపగంటి సుదర్శన్, దబ్బనబోయిన శేషయ్య, వెంకటనరసయ్య పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందిస్తున్న లయన్స్ సభ్యులు

వైరా: ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంలో వైరా లయన్స్‌క్లబ్ ఎల్లవేళలా ముందుంటుందని లయన్స్‌క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్–2 నంబూరి మధు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. వైరాలోని రాజశేఖర్ నగర్‌కు చెందిన వాడపల్లి చంద్రికకు రూ.40 వేలు విలువగల ల్యాప్‌టాప్‌ను వితరగా అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్, చింతోజు నాగేశ్వరరావు, రాంబాబు, రాంగోపాల్, రాము, నారాయణ, రామారావు, నీరజ తదితరులు పాల్గొన్నారు.

విప్లవోద్యమాలను బలోపేతం చేయాలి

బోనకల్: ప్రపంచ ప్రథమ సోషిలిస్ట్, మార్క్సిస్ట్ మహోద్యమ నాయకుడు లెనిన్ అమరత్వం పొంది 100ఏళ్లు నిండుతున్న సందర్భంగా ఆయన స్ఫూర్తితో విప్లవోద్యమాలను బలోపేతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.గిరి అన్నారు. శనివారం లక్ష్మీపురంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, రవి, రామారావు, గోపి, గోవిందరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరురూరల్: పెద్దకోరుకొండి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ చెన్నూరు ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పెద్ద కోరుకొండి ఏఈ తిరుపతయ్య తెలిపారు. కల్లూరు మండలంలోని చెన్నూరు, రావికంపాడు, లింగాల, ఎర్రబోయినపల్లి గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని .. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పరిశ్రమలకు..

తల్లాడ: తల్లాడ పరిశ్రమల ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖాదికారి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

తల్లాడ, అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాల్లో విద్యుత్ పరిశ్రమలకు అంతరాయం కల్గుతుందని తెలిపారు.